## క్లుప్తంగా

### స్పందనలో నాలుగు అర్జీలు

**నందిగామ:** పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. డివిజన్ పరిధిలోని పలు మండలాలకు చెందిన వారు నాలుగు అర్జీలను అందజేశారని ఆర్డీఓ రవీంద్రరావు తెలిపారు.

### అర్జీలకు తక్షణ పరిష్కారం

**వీరులపాడు:** స్పందన కార్యక్రమంలో దాఖలయ్యే అర్జీలను పరిశీలించి, తక్షణమే పరిష్కరించనున్నట్లు తహసీల్దార్ ఆశయ్య నాయక్ పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు అర్జీలు వచ్చాయని తెలిపారు. అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించేలా కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులు పాల్గొన్నారు.

### ప్రాంగణ ఎంపికల్లో తొమ్మిది మందికి ఉద్యోగాలు



**పరిటాల(కంచికచర్ల):** పరిటాల ముత్తవరపు వెంకటేశ్వరరావు ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రాంగణ ఎంపికలో ఉద్యోగాలు సాధించారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు సోమవారం తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ హెచ్‌సీఎల్ కంపెనీ ప్రతినిధులు కళాశాల్లో సీఎస్ఈ మూడో సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు నిర్వహించగా, తొమ్మిది మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచారని పేర్కొన్నారు. ఉద్యోగాలకు ఎంపికై విద్యార్థులకు వార్షిక వేతనం రూ.4 లక్షలు ఉంటుందని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించింది. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ అధికారి విజయ కుమార్ పాల్గొన్నారు.

### నేడు వైఎస్సార్ ఆసరా మూడో విడత పంపిణీ

**వీరులపాడు:** మండలంలోని జుజ్జూరు గ్రామంలో వైఎస్సార్ ఆసరా మూడో విడత పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ కోటేరు లక్ష్మీ పేర్కొన్నారు. స్థానిక ఎంపీపీ కార్యాలయంలో సోమవారం ఆమె మాట్లాడుతూ గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం ఉదయం 10 గంటలకు కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు ముఖ్య అతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు.

### పొన్నవరంలో సెంట్రల్ హెల్త్ టీం సభ్యుల పర్యటన

**పొన్నవరం(వీరులపాడు):** నేషనల్ హెల్త్ ఫ్యామిలీ సర్వీస్‌కు సంబంధించి సెంట్రల్ హెల్త్ టీం సభ్యులు సోమవారం గ్రామంలో పర్యటించారని సర్పంచ్ షోడగిరి రాజశ్రీ పేర్కొన్నారు. వీరు ఇంటింటికీ తిరిగి ప్రజల స్థితి గతులను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు రమణారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### కల్యాణోత్సవాలపై సమావేశం

**తిరుమలగిరి(జగ్గయ్యపేట):** గ్రామంలో వేంచేసియున వాల్మీకోద్భవ వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలపై సోమవారం గ్రామస్తులతో ఆలయ ఏసీ దాసరి శ్రీరామవరప్రసాదరావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ మొదటి వారంలో కల్యాణోత్సవాలు జరుగుతాయన్నారు. ఈ ఉత్సవాల్లో రథోత్సవం విషయంపై గ్రామస్తులతో చర్చించారు. పాలకవర్గం లేకుండానే అధికారులు సమావేశం ఏర్పాటు చేయడంపై ఆలయ చైర్మన్ పసుపులేటి రాదాసుబ్రహ్మణ్యం అసంతృప్తి వ్యక్తం చేశారు. విషయంపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

### దరఖాస్తుల ఆహ్వానం

**నందిగామ:** ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సీడీపీఓ భాగ్య రేణుక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాజెక్టు పరిధిలోని నాలుగు మండలాల పరిధిలో ఒక కార్యకర్త, తొమ్మిది సహాయకులు పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. అర్హులైన మహిళలు ఏప్రిల్ నాలుగో తేదీ లోపు దరఖాస్తు అందజేయాలని కోరారు. పూర్తి వివరాలకు కార్యాలయంలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

### పాడిరైతు కుటుంబానికి క్షీరబంధు అందజేత

**హనుమాన్‌జంక్షన్ రూరల్:** ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పాడిరైతు కుటుంబానికి కృష్ణామిల్క్ యూనియన్ అండగా నిలబడింది. బాపులపాడు మండలం వీరవల్లి శివారు గ్రామమైన నారాయణపురానికి చెందిన తంబళ్ల సుబ్బారావు ఇటీవల మరణించడంతో కృష్ణామిల్క్ యూనియన్ అమలు చేస్తున్న క్షీరబంధు పథకం కింద రూ.50 వేలు సాయాన్ని ఆయన కుటుంబానికి సోమవారం అందజేశారు. వీరవల్లి పాల సొసైటీ అధ్యక్షుడు కసుకుర్తి నిరంజనరావు, సభ్యులు కోడెబోయిన బాబి, అరవపల్లి సీతారామయ్య, సూపర్‌వైజర్ గోపాల్ మృతుడి కటుంబాన్ని పరామర్శించి, ఈ మొత్తాన్ని అందించారు.

# పొదుపు మహిళలే యజమానులు

- ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు, కలెక్టర్ ఢిల్లీరావు
- కంచికచర్లలో చేయూత మహిళా మార్ట్ ప్రారంభం



కంచికచర్ల అంబేడ్కర్ సెంటర్లో చేయూత మహిళా మార్ట్‌ను కలెక్టర్ ఢిల్లీరావుతో కలసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

**కంచికచర్ల:** మహిళలు అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలవాలనే లక్ష్యంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన పథకాలు సత్ఫలితాలు ఇస్తున్నాయని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. కంచికచర్ల అంబేడ్కర్ సెంటర్లో చేయూత మహిళా మార్ట్‌ను జిల్లా కలెక్టర్‌తో కలసి ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పొదుపు సంఘాల మహిళలు లక్షాధికారులు కావాలనేదే దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కల అని, అందుకు అనుగుణంగా డ్వాక్రా సంఘాలకు మద్దతుగా నిలిచారని గుర్తుచేశారు. అదే బాటలో ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం విశిష్ట సంస్కరణలు చేపట్టి అమలు చేస్తున్నారన్నారు. అందులో భాగంగా ప్రారంభమైనదే చేయూత మహిళా మార్ట్ అని పేర్కొన్నారు. పొదుపు సంఘాలకు జీవనోపాధి కల్పించేందుకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. మహిళలు వ్యాపారవేత్తలుగా మారాలనే లక్ష్యంతో ప్రభుత్వం సంకల్పిస్తున్న చేయూత మహిళా మార్ట్‌లు మహిళల ఆర్థిక ప్రగతికి బాటలు వేస్తున్నాయని తెలిపారు. ఒక్కో సభ్యురాలు నుంచి రూ. 200ల చొప్పున వసూలు చేసి రూ. 31 లక్షలతో చేయూత మార్ట్‌ను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. జిల్లాలో మొదటిగా విస్సన్నపేటలో ప్రారంభించి రెండో మార్ట్‌ను కంచికచర్లలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ మహిళా మార్ట్‌ను ఆదర్శవంతమైన మహిళా మార్ట్‌గా తీర్చిదిద్దాలన్నారు. ఈ మార్ట్‌లో మార్కెట్ ధర కంటే నిత్యావసర సరుకులు తక్కువ ధరకు లభిస్తాయన్నారు. మహిళలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన విశిష్టమైన ఆలోచన ఈ చేయూత దుకాణాలన్నారు. అనంతరం మార్ట్‌లో ఉన్న నిత్యావసర సరుకులను పరిశీలించి విక్రయించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కే శ్రీనివాసరావు, ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, జెడ్పీటీసీ సభ్యురాలు వేల్పుల ప్రశాంతి, సర్పంచ్ వేల్పుల సునీత, వైస్ ఎంపీపీ మాధవి, ఉప సర్పంచ్ సురేష్ బాబు, తహసీల్దార్ వీ రాజకుమారి, ఎంపీడీఓ కే బాలశంకరరావు, పాల్గొన్నారు.



మహిళా మార్ట్‌లో సరుకులను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

## మహారాణులుగా చూడాలన్నదే సీఎం లక్ష్యం



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న డ్వాక్రా మహిళలు

**అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు):** మహిళలను మహారాణులుగా చూడాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని సర్పంచ్ జ్యోతిబ్రహ్మం అన్నారు. వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడత నిధులు మంజూరు కావటంతో సోమవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద స్వయం సహాయక సంఘాల సభ్యులు సంబరాలు చేసుకున్నారు. సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ ఆసరా పథకం కింద మూడో విడత గ్రామంలో 166 గ్రూపులకు రూ.1,77, 89,090 రుణమాఫీ అయ్యాయన్నారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం మహిళలకు సంబంధించిన డ్వాక్రా రుణాలను మాఫీ చేసి అండగా ఉంటున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటామన్నారు. మండల స్థాయిలో ఆసరా పథకంపై స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను సమక్షంలో పెద్ద ఎత్తున సంబరాల కార్యక్రమం పెనుగంచిప్రోలులో ఏప్రిల్ 5న నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీఎం రాజారావు పాల్గొన్నారు.

## రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి ప్రాధాన్యం

మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర



రోడ్డు శంకుస్థాపనలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర

**జగ్గయ్యపేట అర్బన్:** పట్టణ అభివృద్ధిలో భాగంగా అన్ని వార్డుల్లో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. సోమవారం స్థానిక ఐదో వార్డులో రూ.8 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో రోడ్లు శిథిలావస్థకు చేరడంతో బురదమయంగా మారి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు కౌన్సిలర్ వట్టెం మనోహర్ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. దీంతో ప్రజల సౌకర్యార్థం ఈ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఎమ్మెల్యే ఉదయభాను సహకారంతో పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్ వట్టెం మనోహర్, నాయకులు సత్యనారాయణ, శేషు, శ్రీవాణి, ప్రభు పాల్గొన్నారు.

## మూడో రోజు సెంట్రల్ జోన్ క్రికెట్ పోటీలు



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్సై పీవీఎస్ సుబ్రహ్మణ్యం

**కంచికచర్ల:** కంచికచర్ల మిక్ ఇంజినీరింగ్ కళాశాలలో జేఎన్‌టీయూ కే సెంట్రల్ జోన్ క్రికెట్ టోర్నమెంట్‌ను మూడోరోజు సోమవారం ఎస్సై పీవీఎస్ సుబ్రహ్మణ్యం ప్రారంభించారని ఫిజికల్ డైరెక్టర్ నిమ్మగడ్డ శౌరయ్య తెలిపారు. మొదట మ్యాచ్ కంచికచర్ల మిక్ ఇంజినీరింగ్ కళాశాల, ఎస్ఆర్ఐ నరసారావుపేట కళాశాల జట్ల మధ్య జరిగిందన్నారు. మొదట టాస్ గెలిచిన ఎస్ఆర్ఐ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ ప్రారంభించిన మిక్ నిర్ణీత 15 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 114 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్ ప్రారంభించిన ఎస్ఆర్ఐ జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 90 పరుగులు చేసి ఆలవుట్ అయింది. ఈ మ్యాచ్‌లో మిక్ జట్టు గెలుపొందింది. రెండో మ్యాచ్ ఎస్ఆర్ఐ గుంటూరు జేఎన్‌టీయూ కాకినాడ జట్ల మధ్య జరిగింది. ఎస్ఆర్ఐ జట్టు తొలుత టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన జేఎన్‌టీయూ జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 98 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన ఎస్ఆర్ఐ జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 81 పరుగులు మాత్రమే చేసింది. 17 పరుగుల తేడాతో ఎస్ఆర్ఐ జట్టుపై జేఎన్‌టీయూ కే విజయం సాధించింది. మ్యాచ్‌లకు అంపైర్లుగా జీ సహదీష్, ఏ ప్రశాంతి, అశోక్‌రెడ్డి, వెంకటరమణ వ్యవహరించారని శౌరయ్య తెలిపారు.

## దాతల సాయంతో కళా వేదిక ఏర్పాటు



నృత్యం చేస్తున్న విద్యార్థులు

**నందిగామ:** మండలంలోని లింగాలపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో దాతల సహకారంతో కళావేదికను ఏర్పాటు చేశారు. తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన దాత దాములూరి వెంకటేశ్వరరావు సమకూర్చిన రూ.3 లక్షల సాయంతో పాఠశాల ఆవరణలో కళావేదికను నిర్మించారు. ఈ కళావేదికను సోమవారం సర్పంచ్ బొల్లినేని పద్మ ప్రారంభించారు. అనంతరం పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమం, పదో తరగతి విద్యార్థులకు వీడ్కోల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ మార్కపుడి గురుస్వామి, హెచ్‌ఎం రాంబాబు పాల్గొన్నారు.

## ఏఐవైఎఫ్ సమావేశాన్ని జయప్రదం చేయండి



ఏఐవైఎఫ్ కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

**జగ్గయ్యపేట అర్బన్:** ఏప్రిల్ రెండో తేదీన నందిగామలో నిర్వహించనున్న అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ జనరల్ బాడీ సమావేశాన్ని జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు లంకా గోవిందరాజులు కోరారు. సోమవారం స్థానిక ఆర్టీసీ డిపో ఎదురుగా ఉన్న పిల్లలమర్రి వెంకటేశ్వరరావు భవన్‌లో సమావేశానికి చెందిన కరపత్రాలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ యువత ప్రగతిశీల అభ్యుదయ భావాలు, దేశభక్తి, ప్రజాస్వామిక విలువలను, మానవత్వాన్ని, నైతిక విలువలను మేలుకొల్పడానికి అఖిల భారత యువజన సమాఖ్య నిరంతరం కృషి చేస్తోందన్నారు. నందిగామలోని చంద్ర రాజేశ్వరరావు భవన్‌లో నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల జనరల్ బాడీ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏఐవైఎఫ్ పట్టణ కార్యనిర్వాహక అధ్యక్షుడు యంద్రపల్లి భాను, నాయకులు జోజి, అంజి, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు నీలకంఠం శివప్రసాద్ పాల్గొన్నారు.

### ఆర్డీఓను కలిసిన మున్సిపల్ కమిషనర్



ఆర్డీఓకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్

**నందిగామ:** జగ్గయ్యపేట మున్సిపల్ కమిషనర్ సీహెచ్ మల్లేశ్వరరావు ఆర్డీఓ రవీంద్రరావును సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పేట మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయన ఆర్డీఓను మర్యాదపూర్వకంగా కలిసేందుకు వచ్చానని పేర్కొన్నారు.

### కమిషనర్‌ను అభినందించిన మున్సిపల్ చైర్మన్

**జగ్గయ్యపేట అర్బన్:** జగ్గయ్యపేట పురపాలక సంఘం నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన చదవోలు నాగమల్లేశ్వరరావును మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అభినందించారు. ఈ సందర్భంగా సోమవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కమిషనర్‌కు అభినందనలు తెలిపారు. కౌన్సిలర్లు రోశయ్య, కాశి కిషోర్ పాల్గొన్నారు.

### ఉచిత కంటి వైద్యశిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ దత్తు

**గండేపల్లి(కంచికచర్ల):** మండలంలోని గండేపల్లి ఎస్‌డీఏ చర్చి ఆవరణలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యుడు బొక్కా వీరయ్య సోమవారం తెలిపారు. నూజివీడు అమెరికన్ ఆస్పత్రికి చెందిన వైద్యులు డాక్టర్ దత్తు, ప్రభుదాస్‌లు 100 మందికి ఉచితంగా కంటి పరీక్షలు చేసినట్లు పేర్కొన్నారు. కళ్ల సమస్యలు, పొరలు, శుక్లాలు, నీటి కాసులు, మసకగా కనపడుతున్నవారికి పరీక్షలు చేసినట్లు తెలిపారు. 10 మందికి కంటి ఆపరేషన్లు చేయాలని గుర్తించారని పేర్కొన్నారు.

### జయప్రదం చేయాలి

**గన్నవరం:** బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు బడుగు మరియదాసు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం మండలంలోని బుద్దవరంలో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వంలో అన్ని వర్గాలకు అన్యాయం జరుగుతోందన్నారు.

### మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగింత



**పెనుగంచిప్రోలు:** స్థానిక మునేరు కాజ్‌వే పక్కన నూతల పాటి కన్వెన్షన్ వద్ద చనిపోయన వ్యక్తి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు సోమవారం పోలీసులు అప్పగించారు. చందర్లపాడు మండలం వెలదికొత్తపాలెం గ్రామానికి చెందిన కూరంపల్లి వెంకటరమణ(65) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మధిరలో ఉన్న కుమారుడి వద్ద నుంచి గ్రామంలోని కుమార్తె వద్దకు వస్తూ మార్గమధ్యంలో స్పృహ తప్పి పడిపోయాడు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది వచ్చేలోపే అతడు మృతి చెందాడు. ఎస్సై హరిప్రసాద్ సమక్షంలో మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

### పేకాట శిబిరాలు చట్ట విరుద్ధం

**జుజ్జూరు(వీరులపాడు):** పేకాట శిబిరాలు చట్ట విరుద్ధమని, వాటిని నిర్వహించే వారిపై చర్యలు తప్పవని ఎస్సై సోమేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని జుజ్జూరు గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై సోమవారం ఆయన సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పేకాట శిబిరం నిర్వహిస్తున్నారనే సమాచారం రావడంతో దాడి చేసినట్లు పేర్కొన్నారు. ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 2,100 స్వాదీనం చేసుకున్నట్లు తెలిపారు.

## మహిళల అభ్యున్నతికే ప్రాధాన్యం

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

**నందిగామ టౌన్:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల అభ్యున్నతికి ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం మూడో ఏడాది వైఎస్సార్ ఆసరా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పొదుపు సంఘాల మహిళలకు ఆసరా నమూనా చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు జీవనోపాధి కల్పించి ఆర్థికంగా ఎదిగేందుకు అమూల్, హిందుస్థాన్, యూనీలివర్, ఐటీసీ, తదితర దిగ్గజ కంపెనీలు, బ్యాంకులతో ఒప్పందాలు చేసుకుని చక్కటి వ్యాపార మార్గాలు చూపుతున్నారన్నారు.

**రూ. 3.87 కోట్ల లబ్ధి**

నందిగామ మండలంలోని 532 పొదుపు సంఘాలకు వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.3.87 కోట్ల మేర లబ్ధి చేకూరిందని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, వ్యవసాయాభివృద్ధి సంస్థ డైరెక్టర్ మంగునూరు కొండారెడ్డి, ఎంపీపీ అరిగెల సుందరమ్మ, నాయకులు గుడివాడ సాంబశివరావు, మంచాల చంద్రశేఖర్, నల్లమల్లి మురళి పాల్గొన్నారు.

**గ్రామీణ ప్రజల జీవనోపాధికి గొర్రెలు, మేకలు కీలక ఆదాయం**

**కంచికచర్ల :** గ్రామీణ ప్రాంత ప్రజలకు పశువులు, మేకలు, గొర్రెలు, కోళ్లు జీవనోపాధికి కీలక ఆదాయమని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు, జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు అన్నారు. కంచికచర్లలో వైఎస్సార్ ఆసరా పథకం చెక్కుల పంపిణీ కార్యక్రమానికి విచ్చేసిన కలెక్టర్ ఎమ్మెల్యే తో కలసి జగనన్న జీవక్రాంతి పథకంలో భాగంగా లబ్ధిదారులకు సోమవారం గొర్రెలు, మేకలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వాలంబనకోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఒక్కో మహిళకు వడ్డీ లేకుండా రూ. 50వేల వరకు రుణ సదుపాయం కల్పిస్తుందని పేర్కొన్నారు. ఈ పథకంలో పొందిన గొర్రెలు, మేకలు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 5వేల బీమా ఇస్తుందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, సర్పంచ్ సునీత, ఎంపీపీ మలక్‌బషీర్, జెడ్పీటీసీ సభ్యురాలు ప్రశాంతి, ఉపసర్పంచ్ సురేష్‌బాబు, తహసీల్దార్ రాజకుమారి, ఎంపీడీఓ బాలశంకరరావు, ఏపీఎం భాస్కరరావు పాల్గొన్నారు.

## సీఎస్ఐ మిషనరీ ఆస్పత్రిలో పేదలకు వైద్యం



సీఎస్ఐ మిషనరీ ఆస్పత్రికి శంకుస్థాపన చేస్తున్న బిషప్ రెవ జార్జి కొర్నేలియస్

**జగ్గయ్యపేట అర్బన్:** జగ్గయ్యపేట పట్టణంతో పాటు పరిసర ప్రాంతాలకు సీఎస్ఐ(చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా) సంస్థ మిషనరీ ఆస్పత్రి ద్వారా పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించనున్నట్లు సీఎస్ఐ కృష్ణా, గోదావరి అధ్యక్ష ఖండం పీఠాధిపతి(బిషప్) రైట్ రెవ డాక్టర్ టి.జార్జి కొర్నేలియస్ అన్నారు. సోమవారం స్థానిక విజయవాడ రోడ్‌లోని వైఎస్ సర్కిల్ వద్ద ఉన్న సీఎస్ఐ కాంపౌండ్‌లో నూతనంగా నిర్మించనున్న సీఎస్ఐ మిషనరీ హాస్పిటల్‌కు బిషప్ జార్జి కొర్నేలియస్ జర్మనీకి చెందిన రెవ డానియెల్ హ్యాపెల్ (సెక్రటరీ, డిజిగ్నేట్ ఫర్ పార్ట్‌నర్‌షిప్ అండ్ డెవలప్‌మెంట్ ఈకేహెచ్ఎన్ సంస్థ, జర్మనీ)తో కలిసి శంకుస్థాపన చేశారు. ముందుగా కొన్ని వ్యాధులకు సంబంధించి ఓపీ విభాగాన్ని కూడా ప్రారంభించారు. అనంతరం బిషప్ మాట్లాడుతూ ఈ ఆస్పత్రి నిర్మాణానికి స్థానిక ఫండ్స్‌తో పాటు జర్మనీ నుంచి వచ్చిన ప్రతినిధులు కూడా నిధులు మంజూరు చేయనున్నట్లు హామీ ఇచ్చారని తెలిపారు. దీంతో రానున్న రోజుల్లో ఇక్కడ అధునిక ఎక్విప్‌మెంట్స్, సాంకేతిక పరిజ్ఞానంతో మంచి ఆస్పత్రిని నిర్మిస్తామని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే ఉదయభాను సహకారం అందించడంతో వేగంగా నిర్మాణ పనులకు ఏర్పాట్లు జరిగినట్లు తెలిపారు. సీఎస్ఐ ఎగ్జిక్యూటివ్ మెంబర్ పి.కనకరాజు, సీఎస్ఐ టౌన్ చర్చి డీనరీ చైర్మన్ డి.రాజు, చర్చి ఫ్యారిష్ కమిటీ ప్రతినిధులు ఇమ్మానుయేల్, దేవరాజు, ప్రభాకర్, జె.కుమార్‌బాబు పాల్గొన్నారు.

## కచ్చితమైన కొలతలు, హద్దులతో రీ సర్వే

తహసీల్దార్ రాజకుమారి



పరిటాలలో సరిహద్దు రాళ్లను దగ్గరుండి పాతిస్తున్న తహసీల్దార్

**కంచికచర్ల:** కచ్చితమైన కొలుతలు, హద్దులతో భూములను రీ సర్వే చేసి, సర్వే హద్దు రాళ్లను పాతిస్తున్నట్లు తహసీల్దార్ రాజకుమారి అన్నారు. మండలంలోని పరిటాలలో సోమవారం జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు భూములను రీ సర్వే చేసి, రైతులకు పట్టాలు పంపిణీ చేశారు. ఆ భూములకు ప్రభుత్వం పంపిణీ చేసిన సరిహద్దు రాళ్లను పాతారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతులు పొలానికి భూ హక్కు పత్రంతో హాజరుకావాలని కోరారు. స్టోన్ ప్లాంటేషన్ ఏప్రిల్ 15వ తేదీలోగా సరిహద్దురాళ్లను పాతేలా తగు చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు, కౌలురైతులు తమ సిబ్బందికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో డీటీ నాగుల్‌మీరా, ఆర్ఐ శిరీష, సర్వేయర్ బసవరావు, వీఆర్వోలు శ్రీలక్ష్మి, ప్రదక్షిణరావు, జనార్దన్ పాల్గొన్నారు.

## పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న 'పది' ప్రశ్న పత్రాలు



ప్రశ్నపత్రాలు, మెటీరియల్‌ను పోలీస్‌స్టేషన్లో అందజేస్తున్న అధికారులు

**నందిగామ:** వచ్చే నెల మూడో 10వ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో 10వ తరగతి సెట్ వన్ పరీక్ష పత్రాలు సోమవారం నందిగామకు చేరుకున్నాయి. పట్టణంలో ఏర్పాటు చేసిన పది పరీఓ కేంద్రాలకు సంబంధించిన సెట్ వన్ పరీక్ష పేపర్లు పోలీస్‌స్టేషన్ లో భద్రపరిచినట్లు కస్టోడియన్ ఆర్.రాంబాబు తెలిపారు. మంగళవారం సెట్–2 పరీక్ష పత్రాలు వస్తాయని పేర్కొన్నారు.

**పెనుగంచిప్రోలు:** ఏప్రిల్ మూడో తేదీ నుంచి నిర్వహించనున్న పదో తరగతి పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలు సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నాయి. వాటిని ఎస్సై ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో పరీక్షల రూట్ ఆఫీసర్, వత్సవాయి ఎంఈఓ కె.నాగరాజు అందజేశారు. కార్యక్రమంలో పరీక్షల అసిస్టెంట్ ఆఫీసర్, చీఫ్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

## పోషకాహారంతో రక్త హీనత నివారణ



విద్యార్థినులకు పోషణ పక్వాడా పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

**పెనమలూరు:** రక్తహీనత లేకుండా ఉండే విధంగా ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.రమానాగమణి అన్నారు. గంగూరు, వణుకూరు గ్రామాల్లో సోమవారం పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా రక్తహీనతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రక్తహీనత రాకుండా చిరుధాన్యాలు, ఆకుకూరలు ఆహారంగా తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం సరఫరా చేస్తుందన్నారు. తల్లులు, గర్భిణులు, చిన్నారులు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని కోరారు. పాఠశాల హెచ్‌ఎం బీపీఎల్.పద్మలత, టీచర్లు వినోదిని, విజయలక్ష్మి, ఈవో సుబ్బారావు, శశాంక్, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.